కీసర హోలీమేరీ కాలేజీలో కుత్బుల్లాపూర్ ఓట్ల లెక్కింపు నేడు


ఓట్ల లెక్కింపు కేంద్రం

కుత్బుల్లాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కార్యక్రమం కీసర సమీపంలోని బోగారం హోలీమేరీ కాలేజీలో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సిబ్బంది మొత్తం కాలేజీకి చేరుకున్నారు. సోమవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పులి సైదులు ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం పూర్తి చేశారు. సిబ్బంది పాటించాల్సిన నియమావళిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌ఓ వి.నర్సింహులు, బాచుపల్లి, గండిమైసమ్మ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.


అల్లాపూర్ ప్రధాన రహదారిలోని కల్వర్టు వద్ద చెత్త


రోడ్ల పక్కనే చెత్తకుప్పలు

అల్లాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని ఏకైక రహదారి పక్కనే కొందరు చెత్త డంప్ చేస్తున్నారు. అధికారులు చెత్త తరలించే ఏర్పాట్లు చేయడం లేదు. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో నిత్యం దుర్వాసన వెలువడుతోంది. ఈ కల్వర్టు ప్రాంతంలో చెత్త వేయకుండా నివారించడం అధికారులకు సవాలుగా మారింది. ఈ విషయమై అధికారులను వివరణ అడుగగా ఇంటింటికీ వచ్చే వాహనాల్లోనే చెత్త వేయాలని అధికారులు ప్రకటనలిచ్చి ఊరుకుంటున్నారు. అల్లాపూర్‌లోని లక్ష్మీనగర్ నాలా కల్వర్ట్ వద్ద చెత్త వేయకుండా చర్యలు తీసుకోలేకపోతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్స్ పంపిణీ


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మాధవరం రంగారావు, నిర్వాహకులు

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పటేల్‌కుంట సమీపంలోని ఆర్ట్ బార్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా క్యాంపులో శిక్షణ ఇచ్చిన చిత్రకళ, డ్యాన్స్, యోగా, చెస్, చేతిరాత వంటి అంశాల్లో రాణించిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ వైస్‌చైర్మన్ ఏ.గురురాజ్, సీనియర్ జర్నలిస్ట్ యజ్ఞమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు రాజశేఖర్ చిత్రకారునిగా, పొలిటికల్ కార్టూనిస్ట్‌గా రాణిస్తూ విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.


ఐఎన్‌టీయూసీ నాయకుడు నాగరాజును కలిసి సమస్యలు విన్నవిస్తున్న కార్మికులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

జీడిమెట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నగర శివార్లలోని పలు పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులు రావాల్సిన ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు సరిగా ఇవ్వడం లేదని, కొన్ని పరిశ్రమలలో సరైన వేతనాలు అమలు చేయడం చేదని నాగరాజు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆయన కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని అన్నారు. వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీ, రాము, అంజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రోడ్డుపై చేరిన వర్షపు నీరు

రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గాజులరామారం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి గాజులరామారంలోని రోడ్లపై వర్షపునీరు, డ్రైనేజీ నీరు చేరి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. మోకాలిలోతు నీళ్లలోని వాహనదారులు రోడ్డు దాటారు. ముఖ్యంగా గాజులరామారం రామ్‌కీ అపార్టుమెంట్ దగ్గర, హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై వర్షపు నీరు చేరింది. ఈ వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా ఉండడంతో గంటకు పైగా వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ స్తంభంపై పడిన చెట్టు


ఆర్‌టీఏ కార్యాలయంలో విరిగిన చెట్టు

పేట్‌బషీరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ఆర్‌టీఏ కార్యాలయంలో చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడిపోయాయి. దీంతో ఆర్‌టీఏ కార్యాలయంలో సోమవారం కరెంట్ సరఫరా లేకపోవడంతో వినియోగదారులకు సేవలు నిలిచిపోయాయి. కార్యాలయాలకు వచ్చిన వినియోగదారులు ఉసురుమంటూ వెళ్లిపోయారు. తిరిగి మంగళవారం యథావిధిగా సేవలు అందించనున్నట్లు అధికారులు తెలియజేశారు.

త్యాగరాయగానసభ వ్యవస్థాపక వేడుకలు షురూ

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభ 58వ వ్యవస్థాపక వేడుకలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గానసభ శాస్త్రీయ కళలకు ప్రాధాన్యత ఇస్తోందని యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలో గానసభ ప్రాచుర్యం పొందిందని ఐదున్నర దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ నిర్వాహకులు గానసభ ప్రతిష్ఠను కాపాడుతున్నారని అభినందించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ గానసభ 58 ఏళ్ల ప్రయాణంలో ప్రఖ్యాత సంగీత నృత్య నాటక కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రెండు రోజులపాటు వ్యవస్థాపక వేడుక జరుపుతున్నామని తెలిపారు.

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్టకాలనీకి చెందిన అర్జున షణ్ముకికి అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును సప్తగిరికాలనీలోని తన నివాసంలో బాధితుడికి సోమవారం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ.

-వివేకానందనగర్‌కాలనీ

కేపీహెచ్‌బీలో డ్రగ్స్ స్వాధీనం

14.26 గ్రాముల ఎండీఎంఏ పట్టివేత

హైదర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ మెట్రోస్టేషన్ వద్ద నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను కేపీహెచ్‌బీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబైలో నివాసం ఉండే రోహిత్ హైదరాబాద్‌కు చెందిన వంశీకృష్ణ (24) గతంలో ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా కలిసి పని చేశారు. ఈ క్రమంలో వారికి డ్రగ్స్ తీసుకోవడం అలవాటు అయింది. కొన్ని రోజుల క్రితం వంశీకృష్ణ హైదరాబాద్ వచ్చి మాదాపూర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. వంశీకృష్ణ కోరిక మేరకు ముంబై నుంచి డ్రగ్స్ పంపించేందుకు రోహిత్ ఒప్పుకుని డ్రగ్స్ సేకరించాడు. దానిని ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తూ హైదరాబాద్‌కు వస్తున్న దీపక్, సాయితేజకు అందించాడు. ఆదివారం సాయంత్రం ముంబై నుంచి తీసుకువచ్చిన పాకెట్‌ను వంశీకృష్ణకు అందించేందుకు జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ వద్దకు రావాల్సిందిగా సాయితేజ, దీపక్‌లు సూచించారు. డ్రగ్స్ సరఫరాపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు మెట్రోస్టేషన్ వద్ద సాయితేజ, వంశీకృష్ణ, దీపక్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి అనుమానం రాకుండా ఆయుర్వేద మందుల డబ్బాలో ఉంచిన 14.26 గ్రాముల నిషేధిత ఎండిఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసుల అదుపులో గంజాయి సరఫరా చేస్తున్న యువకులు

● మరో కేసులో గంజాయి పట్టివేత

కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నెంబర్ 3లోని హేమంత్ బాయ్స్ హాస్టల్‌లో బొమ్మారెడ్డి సందీప్‌రెడ్డి(25), కోయా ఉదయ్‌కిరణ్(19) ఉంటున్నారు. వీరు కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసలై డ్రగ్స్, గంజాయి సేవిస్తున్నారు. ఈ క్రమంలో డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించాలని నిర్ణయించుకుని రామారావు అనే సప్లయర్ నుంచి రూ.18 వేలకు రెండు కిలోల గంజాయి కొన్నారు. దానిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ వద్ద అమ్ముతుండగా సోమవారం కేపీహెచ్‌బీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 ప్యాకెట్ గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాకాలం పూర్తయ్యే వరకూ సెల్లార్లు తవ్వొద్దు

● శిథిల భవనాలను ఖాళీ చేయాలి ● జంట సర్కిళ్ల ఉపకమిషనర్లు

జీడిమెట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో వర్షాకాలం పూర్తయ్యే వరకూ భవన నిర్మాణాల కొరకు ఎలాంటి సెల్లార్ల తవ్వకం, నిర్మాణం, గతంలో తీసిన సెల్లార్లకు మరమ్మతులు చేపట్టకూడదని కుత్బుల్లాపూర్, గాజులరామారం ఉపకమిషనర్లు వి.నర్సింహ్మా, మలయ్యలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి సెల్లార్లు తవ్వి నిర్మాణాలు సాగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా శిథిల భవనాల్లో నివసిస్తున్న ప్రజలు తక్షణమే ఖాళీ చేసి వెళ్లాలని, ముందస్తు చర్యల్లో భాగంగా ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. శిథిల భవనాలు ఖాళీ చేయకుండా, ప్రమాదాలకు కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మీ సమష్టి కృషి, నిబద్ధత ఆదర్శనీయం

కార్మికుడిని కాపాడిన అధికారులను అభినందిస్తూ మేయర్ ట్వీట్

హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సుచిత్ర సర్కిల్ వద్ద గోడ కూలిన ప్రమాదంలో చిక్కుచున్న కార్మికుడిని కాపాడిన అధికారులను నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సోమవారం అభినందించారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుడిని కాపాడేందుకు డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ, ఈవీడీఎం, ఫైర్ సర్వీస్‌లకు చెందిన అధికారులు సిబ్బంది ఏడు గంటల పాటు శ్రమించి కాపాడారని, వారి సమిష్టి కృషి, నిబద్ధత అభినందనీయమని ట్వీట్ చేశారు. అంతేకాకుండా బాధితుడికి ఆక్సిజన్, సలైన్ అందించిన 108 ఈఎంఆర్ఐ సిబ్బందిని అభినందించారు.

రాజేశ్‌కు సకలకళాకిరీటి బిరుదు



రాజేశ్‌ను సకలకళాకిరీటి బిరుదుతో సత్కరిస్తున్న ఆమని, దామోదర్‌గుప్తా

చిక్కడపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్, ఆదర్శ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు సోమవారం త్యాగరాయగానసభలో ఘనంగా నిర్వహించారు. బాలుతో పాటు పలువురు గాయకులకు స్వరనీరాజనం సమర్పిస్తూ గాయనీగాయకులు గీతాలు ఆలపించారు. గాయకుడు, సంగీతదర్శకుడు, శివరంజని కల్చరల్ ఆర్గనైజేషన్ అధినేత రాజేశ్‌కు సకలకళాకిరీటి-2024 బిరుదు ప్రదానంచేసి సన్మానించారు. పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా. నవరసగాయని ఆమని పాల్గొని రాజేశ్‌ను సన్మానించి మాట్లాడుతూ కళాకారులు సమాజానికి చాలా అవసరమని వారిని సరైన గుర్తింపుతో ఎన్నో అద్భుతాలు పొందవచ్చన్నారు.

డబ్బులు తిరిగి ఇవ్వలేదని కిడ్నాప్

మదీన, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ ఇప్పిస్తానని తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఓ వ్యక్తిని కిడ్నాప్ చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బార్కస్‌కు చెందిన సాబెర్ ప్లాట్ ఇప్పిస్తానని మొగల్‌పురాకు చెందిన సమీర్, హాష్మీ వద్ద రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఆరునెలలు గడుస్తున్నా ప్లాట్ ఇప్పించలేదు. డబ్బులు తిరిగి ఇవ్వమని వారు సాబెర్‌ను కోరగా కాలయాపన చేస్తున్నాడు. దీంతో ఇద్దరూ సోమవారం సాబెర్ ఇంటికి వెళ్లి బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. తన భర్తను కిడ్నాప్ చేశారంటూ సాబెర్ భార్య చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేశారన్న విషయం తెలుసుకున్న సమీర్, హాష్మి సాబెర్‌ను విడిచిపెట్టారు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

పౌరహక్కుల నేత వెంకటరమణిని వెనక్కి పంపిన పోలీసులు

హైదరాబాద్: పౌరహక్కుల నేత వెంకటరమణిని పోలీసులు వెనక్కి పంపించారు. స్వీడన్ పౌరసత్వం కలిగిన వెంకటరమణిపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. ఆయన వస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆయనను శంషాబాద్ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. 'వెంకటరమణిపై ప్రభుత్వం నిషేధం ఉంది. ఇక్కడికి వచ్చే ప్రయత్నాన్ని అడ్డుకున్నాం. విమానాశ్రయం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.' అని పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

వానాకాలం సాగుపై రాష్ట్ర సదస్సు 9న

రాజేంద్రనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అరిబండి లక్ష్మీనారాయణ 6వ స్మారకోపన్యాసం సందర్భంగా వానాకాలం సాగుపై ఈనెల 9వ తేదీన రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు నిర్వహించే వాటర్ టెక్నాలజీ ఆడిటోరియాన్ని ఆయన సందర్శించారు. సదస్సులో నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి టి.సాగర్, అరిబండి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అరిబండి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.


దొంగలు ప్రవేశించిన కిటికీ, లాకర్ తెరిచేందుకు ప్రయత్నించిన దృశ్యం

ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం

హైదర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం చేసిన దొంగలు.. సాధ్యం కాకపోవడంతో పారిపోయారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బ్యాంక్ సిబ్బంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీరోడ్ నెంబర్-1లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేపీహెచ్‌బీ శాఖను నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవుకావడంతో బ్యాంకును మూసివేశారు. సోమవారం ఉదయం బ్యాంకును తెరిచేందుకు వచ్చిన సిబ్బంది బ్యాంకులో కారంపొడి చల్లి, వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. ఆదివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో బ్యాంక్‌లో బిల్డింగ్ వెనుకవైపు ఉన్న కిటికీ ఊచలను తొలగించిన ఇద్దరు దొంగలు కిటికీకి అడ్డంగా ఉన్న బీరువాను నెట్టి లోపలికి ప్రవేశించారు. వెం టనే విద్యుత్ సరఫరా నిలిపివేసి సీసీ కెమెరాలపై నల్ల పెయింట్‌ను స్ప్రే చేశారు. తమతో పాటు తెచ్చుకున్న గ్యాస్ కట్టర్ సహాయంతో లాకర్‌ని తెరిచేందుకు విఫలయత్నం చేశారు. లాకర్ ఎంతకూ తెరుచుకోకపోడంతో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు దొంగలు బ్యాంకులో కారం చల్లి పారిపోయారు. బ్యాంకు మేనేజర్, సిబ్బంది ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్‌లో యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

హైదర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీలోని హాస్టల్‌లో ఉంటున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ విశాఖ జిల్లా సాలార్ గ్రామానికి చెందిన సారిపల్లి సాయివంశీ(22) ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా రెండు రోజుల క్రితం నగరానికి వచ్చాడు. కేపీహెచ్‌బీలోని వెంకటసాయి హాస్టల్‌లో చేరాడు. సోమవారం సాయంత్రం తాను ఉంటున్న రూములో ఉరివేసుకున్నాడు. ఆర్థిక సమస్యలు, ఉద్యోగం లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో గృహిణి..

చందానగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చందానగర్ పాపిరెడ్డికాలనీలో సోమవారం చోటుచేసుకుంది. చందానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా శ్రీశైలం మండలానికి చెందిన దినేష్ జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి శేరిలింగంపల్లి పాపిరెడ్డికాలనీలో నివాసం ఉంటూ క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య కె.రాణి గృహిణి. వీరికి ముగ్గురు సంతానం. భర్త తరుచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి భర్తలేని సమయంలో రాణి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గుర్తించిన పక్కింటి వారు మృతురాలి తమ్ముడికి సమాచారం అందించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ స్వీపర్..

కవాడిగూడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో పనిచేసే స్వీపర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గాంధీనగర్ పీఎస్ పరిధిలో సోమవారం జరిగింది. బన్సీలాల్‌పేట పొట్టి శ్రీరాములునగర్‌లో నివాసం ఉండే ఎల్లేష్(35), భార్య మల్లిక ఇద్దరు జీహెచ్‌ఎంసీలో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా ఎల్లేష్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లలేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విధులకు వెళ్లి ఇంటికి వచ్చి భార్య తలుపులు మూసి ఉండటంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు తీసి చూడగా భర్త ఎల్లేష్ ఉరేసుకుని కనిపించాడు. వెంటనే గాంధీనగర్ పీఎస్‌కు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎల్లేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. జీహెచ్‌ఎంసీలో స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎల్లేష్ మతిస్థిమితం సరిగ్గా లేక, లేదా మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడ అనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

అతిగా నవ్వుతూ..!

● పగలబడి నవ్వుతూ స్పృహ కోల్పోయిన వ్యక్తి
● కాసేపు అచేతనం.. తర్వాత సాధారణ స్థితికి
● అపోలోకి తరలింపు ● ఏమీ కాలేదని తేల్చిన వైద్యులు
● నవ్వు ప్రేరిత సింకోప్‌గా నిర్ధారణ

నవ్వు ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటారు. అలాగే నవ్వు నాలుగు విధాల చేటు చేస్తుందని కూడా అంటారు. కొందరి విషయంలో పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. ఓ వ్యక్తి విషయంలో ఇలాగే జరిగింది. టీవీలో కామెడీ షో చూసి విరగపడి ఎక్కువ సేపు నవ్వుతూనే అకస్మాత్తుగా అచేతనంగా కిందపడిపోయాడు. అతన్ని పరిశీలించిన వైద్యులు దాన్ని మూర్ఛకు సంబంధించిన.. స్పృహ కోల్పోయిన సమస్యగా నిర్ధారించారు. ఈరకం జబ్బుతో బాధపడే వారు కూడా ఉంటారా.. అని ఆశ్చర్యమనిపిస్తుంది. అవును ఇలాంటి ఓ కేసు అపోలో ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ వద్దకు వచ్చింది. ఆయన ఈ కేసు వివరాలను తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పంచుకున్నారు.

- హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):



హైదరాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఓ వ్యక్తి విపరీతమైన నవ్వుతో స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. వారం, పది రోజుల క్రితం సదరు వ్యక్తి కుర్చీలో కూర్చుని టీ తాగుతూ తన కుటుంబంతో కలిసి టీవీలో కామెడీ షో చూస్తున్నాడు. ఆ షోలో ఒక అంశం ఆయనకు విపరీతమైన నవ్వును తెప్పించింది. నవ్వును అదుపు చేసుకోలేనంతగా కొన్ని నిమిషాల పాటు పగలబడి ఆగకుండా నవ్వాడు. ఈ క్రమంలో అతను నియంత్రణ కోల్పోయాడు. కొద్దిసేపటి తర్వాత, అతని శరీరం ఒక వైపునకు వంగి, కుర్చీ నుంచి నేలపై పడిపోయి స్పృహ కోల్పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో కళ్లు తెరిచి, తన శరీరాన్ని కదిలించడంతోపాటు మాట్లాడగలిగాడు. ఈ క్రమంలో అతన్ని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ రూమ్‌కి తీసుకొచ్చేసరికి పూర్తిగా కోలుకున్నాడు. పరిశీలించిన వైద్యులు అతనికి ఎలాంటి హానీ జరగలేదని, అనారోగ్యం ఏమీ లేదని నిర్ధారించారు. అతన్ని న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ పరిశీలించి ఈ పరిస్థితిని నవ్వు ప్రేరిత సింకోప్ (Laughter-induced syncope)గా నిర్ధారించారు. ఇది వాసోవాగల్ మెకానిజమ్స్ వల్ల ఏర్పడే అరుదైన అంశంగా ఆయన గుర్తించారు. ఇది ఒక విధమైన మూర్ఛకు సంబంధిత సమస్య అని, ఎలాంటి మందులు అవసరం లేదని, ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తేల్చారు.

అధికనవ్వుతో రక్తసరఫరా తగ్గే ప్రమాదం..

విపరీతమైన నవ్వుతో ఒక్కసారి రక్తపోటు వేగంగా తగ్గిపోతుందని, నాడీ వ్యవస్థ నుంచి అధిక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుందని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు. దీని వల్ల మెదడుకు ప్రవహించే రక్త సరఫరా తాత్కాలికంగా తగ్గుతుందని, ఫలితంగా స్పృహ కోల్పోయే ముప్పు ఉంటుందన్నారు. విపరీతమైన నవ్వు, ఎక్కువసేపు నిలబడటం, అధిక శారీరక శ్రమ వంటి మూర్ఛ సాధారణ ట్రిగ్గర్‌లను నివారించాలని డాక్టర్ సూచించారు. బీపీ మందులు వినియోగిస్తున్నవారు, గుండె జబ్బులు ఉన్న వారు అతిగా, బిగ్గరగా నవ్వొద్దని ఆయన సూచిస్తున్నారు. ప్రమాదం లేమీ లేకపోయినప్పటికీ రక్త ప్రసరణలో మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. 'ఎప్పుడు నవ్వుతూ.. సంతోషంగా ఉండాలని, సంతోషమే సగం బలమని వైద్యులు తరుచూ చెబుతుంటారు. కానీ, దేనిని అతిగా తీసుకోవడం మంచిది కాదని ఈ కేసులో నిరూపితమైంది' అని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

బర్కత్‌పుర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద ఆయిల్ థెరపీ చికిత్స ద్వారా అన్ని రకాల జబ్బులు నయమవుతాయని ఆయిల్ థెరపిస్ట్ శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. సోమవారం బర్కత్‌పురలోని న్యూలైఫ్ ఆయుర్వేదిక్ ఆయిల్ థెరపీ సెంటర్‌లో రెండు రోజులపాటు జరగనున్న ఉచిత వైద్య శిబిరం ప్రారంభమైంది. వంద మంది రోగులు శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదిక్ పంచకర్మ ద్వారా ఆధునాతన చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఆయిల్ థెరపీ చికిత్స అతిపురాతనమైనదని మన దేశంతో పాటు అనేక దేశాలలో ఈ చికిత్స అందిస్తున్నారని ఆపరేషన్ లేకుండా అనేక రోగాలకు ఈ వైద్యం ద్వారా చికిత్స పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బాబు, శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో

ముగిసిన రాష్ట్ర దశాబ్ది వేడుకలు


జెండా ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

దుండిగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తాలోని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ ఏర్పాటుకు ముందు, తెలంగాణ ఏర్పడిన అనంతరం ఉన్న పరిస్థితులను వీడియో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రం కోసమైతే ఉద్యమాలు, ప్రాణత్యాగాలు జరిగాయో, అవన్నీ ఫలించి దశాబ్ద కాలంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం మంచి ప్రగతి సాధించిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చింది కేసీఆరేనని గుర్తు చేశారు. ఈ ముగింపు ఉత్సవాల్లో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు, ప్యాక్స్ డెరెక్టర్లు, కౌన్సిలర్లు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

కట్టు కాలువపై గోడ నిర్మాణం తొలగింపు

అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



గోడను కూలుస్తున్న అధికారులు

పేట్‌బషీరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చెరువు తూము నుంచి పారే కట్టు కాలువపై గోడను నిర్మించడంతో స్థానికులు అక్కడికి చేరుకొని నిర్మాణాలు తొలగించాలని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కట్టు కాలువలో వెలసిన నిర్మాణాన్ని అధికారులు సోమవారం తొలగించారు. కొంపల్లి మున్సిపల్‌లోని దూలపల్లి తుమ్మారు చెరువు తూము సమీపంలోని సర్వేనెంబర్లు 2, 3, 4, 5లోని భూముల నుంచి కట్టు కాలువ లింగం చెరువు వరకు వర్షాధారపు నీరు వెళ్తుండేది. చెరువు కింద కాస్తు చేసుకునే వారు భూమిని బిల్డర్‌కు విక్రయించారు. ఇటీవల ఈ కట్టు కాలువపై నిర్మాణం చేపట్టొద్దని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని, ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీనివాస్‌ను దూలపల్లివాసులు నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, కట్టుకాలువలు కనుమరుగవుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కట్టు కాలువపై నిర్మాణం చేపట్టక ముందే అధికారులు మేల్కొని ఆ పనులను ఆపి వేస్తే బాగుంటుంది కానీ, పనులు జరిగి ఫిర్యాదు చేసినప్పుడు అధికారులు వచ్చి చర్యలు తీసుకోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు తెలుపుతున్నారు. మైసమ్మగూడలోని ఇంజనీరింగ్ కళాశాలలో మురుగు నీరు వచ్చి చెరువులో చేరుతుందని, దీంతో భూగర్భ జలాలు దెబ్బ తింటాయని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు లంచాలకు అలవాటు పడి, వీటిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. గతంలో తుమ్మారు చెరువు అలుగు వారే ప్రాంతంలో ఓ భారీ భవన నిర్మాణం చేపడుతున్నప్పుడు, ఆ కాంపౌండ్ వాలును అధికారులు కూల్చి వేశారు. కట్టుకాలువలను, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లో నిర్మాణాలు జరిగితే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు.